


# ఖానూన్

ఆకాశం ఎత్తున దుమ్ము లేపుకుంటూ మేఘాల్లో పుష్పక విమానంలా వచ్చి ఆగింది హైదరాబాద్ బస్సు.

'గాడి ఏడబోద్ది దొరా?'

'దొరా, గాడి పట్నం పోద్దా?'

'పోద్ది. ఎక్కుండ్రి....'

'పోద్దంట ఉరుకు, ఉరుకు....'

కింద గొంగళి తీసి భుజంమీద వేసుకుని భార్యను తొందర పెడుతూ బస్సు దగ్గరికి పరుగెత్తాడు యాదయ్య. బాలమ్మ చీరలో మూటకట్టిన సామాన్లు నెత్తిన పెట్టుకోబోయింది. పాతచీర పగిలి అందులోంచి ఓ ఇత్తడిచెంబు జారి కింద పడింది.

'నియ్యవ్వ! జల్ది రమ్మంటె నఖరల్ చేస్తవు' అంటూ మళ్ళీ వెనక్కువచ్చి, మూట బిగించి బాలమ్మ నెత్తిన పెట్టాడు. నానాయాతన

పడి, ఇద్దరు ముగ్గురిచేత చీవాట్లుతిని మూటతో ఎలాగో బస్సులో దూరింది బాలమ్మ. బస్సు కదిలింది. యాదయ్య కడ్డీపట్టుకుని పుట్ బోర్డుమీద కాలువేసాడు. భుజమ్మీది గొంగళి కిందికి జీరాడుతోంది. కింద ఎవరో గొంగళి కాస్త తొక్కారు. అది కాస్తా జారి కింద పడింది.

'దొరా, నీ కాల్మొక్త. జర్రి రుకాయించు దొరా.'

పది పదిహేను గజాలు ముందుకెళ్ళి ఆగింది బస్సు. యాదగిరి దిగి పరుగెత్తుకెళ్ళి గొంగళి తెచ్చుకున్నాడు.

పాసింజరు బస్సు ప్రతిచోటా ఆగుతూ, నానా శబ్దాలు చేసుకుంటూ, ఎర్రిటి దుమ్ము లేపుకుంటూ, సగం దుమ్ము లోపలి కాహ్వానిస్తూ ముందుకు పోతోంది. యాదగిరి ఎలాగో కాస్త జాగా చేసుకుని సీట్లొ కూర్చున్నాడు.

బయటికి ఎటుచూసినా విశాలమైన భూమి. ఎక్కడా పచ్చటి మచ్చకూడా కన్పించటంలేదు. అయినా అక్కడక్కడా గొర్రెలూ, పశువులూ ఏదో ఆశతో అటూ యిటూ తిరుగుతున్నాయి. యాదయ్యకు కడుపులో ఏదో కెలికినట్లయ్యింది. అది తను పుట్టిన భూమి. తను చెమటతో తడిపిన నేల. దాన్ని ఒదులుకుని పొట్ట చేత్తో పట్టుకుని కూలికోసం, కూటికోసం పట్నం పోతున్నాడు.

ఎదురుగా ఆడాళ్ళ సీట్లొ బాలమ్మ కూర్చుని వుంది. మాసిన ముతకచీర, భుజాల దగ్గిర పగిలిన జాకెట్టు, ఎన్నాళ్ళ నుంచో చమురు సంస్కారం లేక రాగి రంగు పులుంకుంటున్న జుట్టు - యాదయ్యకు కన్నీళ్ళ పర్యంతమైంది.

బాలమ్మ కూటికి కొరతలేని కుటుంబంలోనే పుట్టింది. ఏదో పదెకరాల కొండర్రి, రెండొందల గొర్రెలూ, మేకలూ వున్నాయి

కదాని తనకిచ్చి పెళ్ళిచేశారు. సొంత పొలం పనులు తప్ప ఎన్నడూ కూలిచేసి ఎరుగని బాలమ్మ తన మూలంగా ఇలాంటి స్థితికి వచ్చింది.

'ఓ. అన్నోవ్...'

యాదయ్య తన ఆలోచనల్లో తనున్నాడు.

'యాడ బోతన్నావ్ ? ఈసారి తట్టిమరీ అడిగాడు పక్కనున్న ఆసామీ.

'పట్నం పోతన్నా అన్నా....'

'నువ్వా ?'

'నేను భీ పట్నం కెల్లె వుంటన్న'

'ఏమన్న కొలువయిందా ?'

'అవ్. అప్సర్ దగ్గర జవాన్‌గ ఉంటున్న. దొర దొర మీదుండె. ఏక్ దో దినం తాతిల్ భీ అచ్చె. ఇంటికొచ్చినా'

'నువ్వు. చాల అదృష్టవంతుడివి' అన్నట్టు చూశాడు యాదయ్య.

'నాకేఁవన్న పనిదొరుకుద్ద అన్నా'

భార్యని వెంటబెట్టుకుని అయితే బయలుదేరాడు. కాని పట్నంలో ఎక్కడుండాలి ? ఏం చెయ్యాలి ? అనే సమస్యలు అతని బుర్రని తొలిచేస్తున్నాయి.

'అప్సర్ల దగ్గరుండెటోల్లకి తెలుస్తదంటగ ?'

'పయిలి అట్టగె తెలుస్తుండే. యీ జమాన్ల తమాం తకలీపయి పాయె. అయ్నపర్వాలా, కొన్ని దినాల్ తక్లీపయిన బరాయించాలి. నాకు భీ జాద తక్లీపయింది భయ్। రొండు మూడు నెల్ కూలి గూడ జేస్న.'

'కూల్దొరుకుద్దా ?'

'మస్తు....'

యాదయ్యకి కొంచెం ధైర్యం చిక్కింది. బతకటానికి ఏదో ఆధారం.

'పయిలెన్నడు పట్నం వచ్చుడు పోవుడు లేదా ?'

'లేదన్న !'

'గావ్‌ల ఏంజేస్తుంటవ్ ?'

'పదెకరాల బూవీ దేఢ్ సౌ గొర్రెలూ ఉంటుండె. అంతపాయె.'

'ఏమాయెనన్నా ?'

'పటేల్ కలిపేసుకుండు.'

'ఎట్ల కలుపుకుంటడు. అట్ల జరక్కుండ ఖానూనుంది ఎరికిలే?'

లేదన్నట్టు చూశాడు యాదయ్య.

'యెంకట రంగారెడ్డి సాబని వజీరుంటుండె, యాదుంద ?'

'అవ్. యాదుంది. మన రాంచదర్రెడ్డి సాబ్ మామే గదా!'

'అవ్ గద్ద దాయ్నే. ఉప్పుడైతె సచ్చిపోయిండు.'

'ఆయన వజీరుగుండె, జమాన్ల బక్కోల్ల బూవులు ఎవల్లి కొనొద్దని ఖానూన్ జేసిండు.'

'ఇంక ఆ జమాన్లనే వున్నరు ?' ఇంకో పేసెంజరు అందుకున్నాడు.

'ఆ ఖానూన్ ఉకద్దయించి సాల్దినాలాయె. దాన్తొనె ఇంకొ ఖానూన్ షరీకు జేసిండు ఎరికలే ?'

'నై సాబ్..., ఎరికలా.'

'అసలేమాయె ఎరికనా ? నందికొండ డాం షురూ జేష్నాక ఆంధ్రినుంచి మంది మస్తుగ దిగితుండ్రి. అచ్చి అమ్మెటోల్ల బూవు

లన్నీ కోనేసు కుంటుంద్రి. భూవులు ఏవడమ్ముకుంటడు ? పేదోడె ! ఎరికనా ? పేదోళ్లు బూవులన్నీ అమ్మేసుకుని కూలోళ్ళయిపోతున్న రవి అమ్మకుండ, కొనకుండ, ఖానూన్జేసిండు రంగారెడ్డి సాబ్.'

'అవ్ ! అదె మరి నే జెప్పేదిబీ'

'ఠీక్ హై దాదా ! ఉస్కా ఊపర్ క్యాహువ మాలుం ? బూసాములు పటేల్ పట్వారీలు జర్రి ఠకాయించిన్రి. అంతకుముందు ఏక్ సౌ, దో సౌ మిత్తికిచ్చి బూఁవులు కలిపేసుకుంటుండె. అది పాయె మరి ! అందుకని పేదోళ్ళందర్నీ జమజేసి రంగారెడ్డిసాబ్ మీటీకి దోలింద్రు....'

'ఫిర్....'

'అమ్మక వచ్చని దుసార్రి ఖానూన్ జేసిండు'

'ఇయ్యవ ! పెద్దోళ్ళ పన్లన్నీ ఇట్టగె వుంటయ్ భాయ్ !'

వీళ్ళ సంభాషణ వింటూవుంటే, గతం అంతా ఆకళింపుకు వస్తోంది యాదయ్యకు.

యాదయ్య లగ్గానికని నూరు రూపాయలూ, బస్తా జొన్నలూ పటేల్ దగ్గర అప్పుతెచ్చాడు యాదయ్య తండ్రి. అది యీ దేశ జనాభా కంటె దారుణంగా పెరిగిపోయింది. సగం పొలం అమ్మి అప్పుతీర్చి మిగిలిన సగం అయినా మిగుల్చుకుందాం అనుకున్నాడు. కాని.... అప్పుడే భూములు అమ్మరాదనే శాసనం వచ్చింది. సమయంచూసి మరీ ఒత్తిడి చేశాడు పటేల్, అప్పు తీర్చమని. ఏం వుంది చేతిలో అప్పు తీర్చటానికి ? ఉన్న పొలం అంతా ఇచ్చేశాడు పండించుకొమ్మని. పండించుకొని అప్పుకు జమకట్టుకొమ్మని. వంద, నూటయాభయిదాకా గొర్రెలూ, మేకలూ వుండేవి. వాటిని మేపుకుంటూ హాయిగానే బతికే వాళ్లు.

యాదయ్య తండ్రి చనిపోయాడు.

'ఏంర యాదయ్యా! నీ బూమి పండదు. అప్పు తీరదు' అన్నాడో రోజున పటేలు.

'ఏమొ దొర! నాకేం ఎర్క! గులాపోణ్ని. తామీల్ నిసి టోండ్లు చెప్పుండ్రి. మీ మాటకి ఎతరాజ్ చెప్తమా?'

'మందని చేన్ల గట్టెయ్యి.'

'చిత్తం....'

మందని తన చేనులోనే కట్టి పటేల్ కోసం భూమిని ఫల పర్చాడు.

వర్షాలు ప్రారంభమైనాయి.

'అర్షాలు పడ్తున్నయ్ దొరా! మంద తోల్కపోయేదా?'

'ఏంర యాదీ! ఆనపడ్తె మంద మొలుస్తదిర! మా ఇజాజత్ లేకండ మంద కదలరాదు ఎరకా? ఆన్ల గట్టిన మందె బూమికి మంచిది.'

ఎన్నడూ లేనిది ఆ సంవత్సరం మంచి వర్షాలు పడ్డాయి. పంటలు విరగపండాయి. కాని మంద మాత్రం సగానికి పైగా చచ్చి పోయింది.

వారం రోజుల తర్వాత యాదయ్యను పిలిపించేడు పటేల్. పద్దులు చూసి వెయ్యి రూపాయలు అప్పు తేల్చాడు.

'పొలం పండించుకుంటనే వుంటుండ్రి....' నీళ్లు నమిలాడు.

'ఏం పొలం? గది పండేటిదేనా? పైస పంట పండలా! చూస్కో, అంతా పద్దుల రాశినా' అంటూ పుస్తకాలు ముందుకు విసిరేశాడు.

'అంజానోణ్ని. నాకేటి ఎరుకవుతది. దొరలే చెప్పుండ్రి'

'చెప్తిగదా ?'

'చిత్తం'

'చిత్తం అంటే గాదుమరి! పైసల్ ఇయ్యాల !!'

'జాయిదాదు తమామ్ తమ కెల్లి వుండె! పైసలేడొస్తయి దొరా ?'

'పైసలు లేకపోతె పొలం రాసెయ్యి.'

'చిత్తం! మీ బాంచను' అంతకంటె ఏమీ అనలేదు. అతని మాటే అక్కడ ఖానూన్ మరి! పదెకరాలూ అలా పోయింది.

ఇంతకాలం గొర్రెల్ని మేపుకుని కాలం వెళ్ళబుచ్చాడు. వర్షాలు లేక అదీ కష్టమైపోయింది. మిగిలిన మంద అమ్మేసి పట్నం బయల్దేరాడు.'

'పట్నంల యేదుంటవు ?' పక్కతను అడిగాడు మళ్ళీ.

'పట్నంల నాకేట ఎరిక ? నీ వళంటోలు చెప్పాలె.'

'మాసబ్ టేంకి కెల్లి మనోల్లు శానమంది వుండె. గుడిసె భీ దొరుకుద్ది.'

'అదేడుందొ ?'

'నే నెరిక సెప్తాగా !'

హైదరాబాద్‌లో బస్సు దిగాక ఎలా పోవాలో చెప్పాడు. పోతూ పోతూ మళ్ళీ గుర్తుచేశాడు యాదయ్య.

'యాదమరిసేవన్నో! నా కొలువు మాట జర్రి యాదుంచు. కోషిష్ చేస్తివ అవుద్ది మరి !'

'యాదమరిసేటిదా యిది ? లేకిన్ .. ఇదంత పైసల్ జమాన అన్నా! పైసలుంటె జల్దినే అవుద్ది'

యాదయ్యకు ఆశ పుట్టింది.

'ఎంతవుద్దేంటన్నా ?'

'యెంతయితే ఏం ఫాయిదా భయ్. గరీబోళ్ళం. ఏడతెస్తం ?'

'పచాస్ రూపాయల్తొ అవుద్ద ?'

'ఓ.... మాంచిగ '

బొడ్డులో బిగుతుగా మడిచికట్టిన కొంగులోంచి యాభై రూపాయిలు తీసి ఇచ్చాడు యాదయ్య.

'మరి నువ్వేడుంటవో ?'

'ఏడుంటెయే ! బినాం గుడిసెల కెల్లి అస్తనే వుంట. నీ కొలువు ఇంతజాం అయితె ఉంటనా ! ఉరికి రాను ?'

అతడికి మరోసారి సలాంచేసి ఇద్దరూ అడుగుకుంటూ కాలి నడకన మాసబ్ టేంకు వైపు బయల్దేరారు.

అకస్మాత్‌గా వాన ప్రారంభమైంది. పరుగెత్తి బస్సుస్టాండులో తల దాచుకున్నారు.

ఒక లారీ వచ్చి అక్కడ ఆగింది. దాంట్లోంచి ఇద్దరు కూలీలు దిగారు.

'మాసబ్ టేంకు ఎడుంటదన్నా' అనడిగాడు యాదయ్య.

'ఇదే మాసబ్‌టాంకు. ఏం కావాలి ?'

'ఈడేమన్న పని దొరుకుద్దా ?'

'పనికేం ? మస్తు ! యాడుంటవ్ ?'

'ఈడనే. ఉప్పుడే అచ్చినా'

'ఓ గుడిసె కాలిగుండె, అస్తవా ?'

'అస్తనన్నా.... నీ కాల్మొక్త.... అన్న మా సల్లని మాట సెప్పిండు' వర్షం తగ్గింది. నలుగురూ గుడిసెలవైపు బయల్దేరారు.

అక్కడ గుడిసెల బారులు తెలంగాణా ప్రాంతపు వర్షాభావానికి

కొలమానాలు. తెలంగాణాలో వర్షాలు పడకపోతే అక్కడ గుడిసెలు పెరుగుతూ వుంటాయి. వర్షాలు పడితే తరుగుతూ వుంటాయి.

వర్షానికి కలుగులో ఎలుకల్లా గుడిసెల్లో దూరినజనం ఒక్కొక్కరే బయటకి వచ్చి మళ్ళీ పోచమ్మ గుడి దగ్గర ముళ్ళ తుమ్మల కింద పోగవుతున్నారు.

'ఓ పోసయ్యన్నోవ్... సెంద్రిగాడి గుడిసె కాలిగుండెగ' అనడిగాడు ఆ యిద్దరిలో ఒకడు.

'అవ్....'

'ఏరే అయనచ్చిండు. ఇప్పిస్తప ?'

'ఎతరాజ్ ఏముండిర ? మైనకీ మూడ్రూపాయలు, కిరాయి పది రూపాయలు. నజ్రాన ఇచ్చుకుంటానంటె సేట్‌తో సెప్త.'

'సేటెవరన్న . ?' యాదయ్య అమాయకంగా అడిగాడు.

'గుడిసెల సంగం పెసిడెంటు. గుడిసెకు మూడు రూపాయిలు కిరాయి, సంగానికో రూపాయి ఇచ్చుకోవాల.'

'ఏమంటవు ?' ముసిలాడు మళ్ళీ అందుకున్నాడు.

'పది రూపాయ లిప్పుడు లేవన్న.'

'లేకమాతే గుడెసెఖీ లేదు. ఇది ఖానూ నిక్కడ.'

'ఈ సీకట్ల, అన్ల ఏడపోతరన్న ! అప్పటి సందుండని, అని ముసిలాణ్ని ఒప్పించి—

'పోనీ ఓ పణ్జెయ్యరాదన్న'

'సెప్పన్న....'

'మా బావ పెయ్యి బాగుండక గుడిసెలోనే పడున్నడు. పొద్గాల అడి రిచ్చ యిప్పిస్త. అడికి సర్ది కమ్మయేదాక తొక్కుకో ... అడికేదో యిద్దువు, నీకు మంచిగనె పంద్రి బీస్ రూపయ్ దొరికుద్ది.'

వలహా బాగానే వుంటి. యాదయ్య కాళ్ళలో మంచి సత్తువ వుంటి. రిక్షా తొక్కటం పెద్ద కష్టం ఏమీ కాదు. కాని తెలీని ప్రదేశం.

'పట్నం నాకేం ఎరికవుతదన్నా ?'

'ఎరికెందుకన్నా. గిరాకే తీస్కపోతడు'

'ఆ.... తీస్కపోతడు.... లైసెన్సుకూడ ఇస్తడా ? పోలీసు పట్కపోతడు మరి ! అన్నాడు మరో కూలీ.

ఆ మాటకే గజగజ వణికిపోయాడు యాదయ్య.

'రిక్షా లాగిటోడు పోలీసోడికి ఫికరయితె బతికినట్టె ! అడట్టు కున్నప్పుడు జరర్రి సాటుకు తీసికెళ్ళి రెండ్రూపాయిలు సేతిలపెడ్తె సరి !' అంతా సరయిపోద్ది.'

'ఎంత భయపడ్డా అంతకంటె గత్యంతరం లేకపోయింటి యాదయ్యకు.

రిక్షా బాగానే కిట్టుబాటయింటి. పదహారు రూపాయిలు సంపాయించాడు. ఇక వెళ్ళిపోదాం అనుకుంటుండగనే మరో గిరాకీ తగిలాడు. అతను చెప్పినట్లే తీసుకుపోతున్నాడు. వెనకనుంచి పోలీస్ ఈల వూదాడు.

'ఏయ్ రిక్షా, రుకో....'

తనను కాదని ముందుకు వెళ్ళిపోయాడు.

మళ్ళీ ఈలవేసి....

'పకడ్ లావ్ భంచత్ కు, పీటో....'

ముందునుంచి మరో పోలీస్ వచ్చి హేండిల్ పట్టుకున్నాడు.

'ఎంబే దమాకరాబయింటిలే ! యెన్కనించి జవాను పిలుస్తుంటె ఉడాయిస్తున్నవ్ ? స్టేషన్ కు పట్కపోయి హడ్డీ నరం చేస్తే అప్పుడు సమజవుద్ది.'

వెనకటి పోలీస్ చేరుకున్నాడు.

'క్యా బే! ఇది ఒన్‌వే ట్రాఫిక్ తెల్వదా ?'

'తెలవ్వద్దొరా ....

'తెలుస్తదిలే, ముఖద్దంల ఇరికిస్తె ... చల్.... స్టేషన్‌కు.'

'కాల్మొక్త దొర! ఇయ్యాల్టికి ఇడిసెయ్యి దొరా' కాళ్లు పట్టుకో బోయాడు.

'ఛత్.... ఉఠ్....'

యాదయ్య రెండు రూపాయలు తీసి చేతిలో పెట్టబోయాడు. పోలీస్ ఉగ్రుడై పోయాడు.

'మాకె.... మస్తీ ఎక్కింది భంచత్! నాకు లంచం ఇస్తవ్ ? షరీఫ్ జవాన్‌కు లంచం ఇస్తవ్‌బే! హడ్డీ నరం కర్తా.... ముల్కుల ఖానూన్ ఖతమైంది బే ? ఛల్'

లాఠీ యాదయ్య శరీరంమీద వీరవిహారం చేసింది. ఈ హడావుడికి జనం పోగయ్యారు. యాదయ్యకు చచ్చినంత పనైంది. దానికి తోడు దెబ్బలు.

'పోనీ యీసారికి వదిలెయ్యవయ్యా అమాయకుళ్ళా వున్నాడు.'

'అమాయకుడు ? నన్నింత అవమానం చేస్తడు ? ఆ జనాబ్ సామ్నె లంచం ఇస్తడు ?' అంటూ మళ్ళీ కొట్టటం మొదలెట్టాడు.

'అరె! ఎందుకయ్యా అట్టా గొడ్డును బాదినట్టు బాదుతావ్ ?' ఇక ఉండలేక గిరాకీకూడా అందుకున్నాడు.

'మాఫ్‌కీజియే సాబ్! తమరు ఇంకో రిక్షా చూస్కోండి' అంటూ ఆ రిక్షాలో తానెక్కి కూర్చుని

'చల్ బే.... చల్ .... ఆ గలీకెల్లి నడుప్.'

ఒక సందులోంచి తీసికెళ్తున్నాడు. ఎటు చూసినా ఎవరూ కన్పించని చోటు చూసి

'రుకో.... గాడీ.,,...' అని అరిచాడు.

రిక్షా దిగి—

'పదిమందిల అట్ల పైసలియ్యజాల్దుర బేవకూఫ్ ?'

'నాకు తెల్వదు దొరా....'

'ఊ.... నికాల్.... ఎన్ని పైసలున్నయ్ ?'

యాదయ్య పైకి తియ్యబోతుంటె చటుక్కున లాక్కున్నాడు పోలీస్....

'దొరా....' చెయ్యి చాచాడు.

'పోబే.... జవాన్ తీసుకున్న పైసల్ వాపసిమ్మంటవ్ ? షరమ్ లేదుర ? ఆశువంటి ఖానూనేదయ్నా జూసినవ్.... చల్ బే... జర౨ సమాల్కె జావ్.... అంటూ లాఠీ ఊపుకుంటూ పక్క సందులోని చిక్కటి చీకట్లో కలిసిపోయాడు పోలీసు.

★